గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండలంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. మిరుదొడ్డి పీహెచ్‌సీలో 24 గంటల వైద్య సేవలు, 108 వాహనం అందుబాటులో ఉండేలా చూస్తానని, రూ.10 లక్షలతో బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకువస్తామని ఎంపీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే రఘునందన్ రావు మాట్లాడుతూ.. పంచాయతీ భవనంలో మౌలిక వసతుల కల్పనకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, సర్పంచ్ రంగనబోయిన రాములు, ఎంపీటీసీలు నర్సింహులు, లక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే రఘునందన్‌రావు

కార్యకర్తకు పరామర్శ..

రుద్రారంలో ఇటీవల జరిగిన ఘటనలో గాయాలపాలైన బీఆర్‌ఎస్ కార్యకర్త కటిక రాజును మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. అండగా ఉంటానని, అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు.

ప్రతీ ఇంటిపై జెండా ఎగరాలి

దౌల్తాబాద్(దుబ్బాక): అజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. సోమవారం మండలంలోని గాజులపల్లిలో సొంత డబ్బులతో నిర్మించిన బస్టాండ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం యువకులకు డ్రైవింగ్ లైసెన్స్ లెర్నింగ్‌లను అందజేశారు. ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోతరాజు కిషన్, నాయకులు భూపాల్‌రెడ్డి, రామస్వామిగౌడ్, నర్సింహారెడ్డి, గ్రామ అధ్యక్షుడు దుర్గారెడ్డి, చందు, ఎల్లం, నరేందర్‌రెడ్డి, కుమార్, భాస్కర్, దినేష్‌రెడ్డి, భిక్షపతి, సంతోష్, ప్రశాంత్, కనకయ్య పాల్గొన్నారు.


గాజులపల్లిలో బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

విభజన గాయాల స్మరణ దినం

సిద్దిపేటజోన్: దేశ విభజన గాయాలను భవిష్యత్ తరాలకు తెలిపేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. విభజన గాయాల స్మరణ దినం పేరిట సోమవారం నోటికి నల్ల గుడ్డలు ధరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, విద్యాసాగర్, శ్రీనివాస్ యాదవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతీ ఒక్కరు ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. సోమవా రం బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు.

మంత్రిని కలిసిన గ్రామస్తులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలం తిగుల్ మదిర గ్రామం రాంనగర్‌ను పంచాయతీ చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రాంనగర్ గ్రామస్తులు, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి, సీనియర్ నాయకుడు దయానంద్‌రెడ్డి తదితరులు మంత్రి హరీశ్ రావును కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి, కుమార్, నర్సింలు, మల్లేశం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి హరీశ్‌రావుతో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు

ఆశీర్వాదం తీసుకున్న సంతోష్‌రెడ్డి

బీఆర్‌ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు అలేటి సంతోష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం మంత్రి హరీశ్‌రావును కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయనతో మర్కూక్, గజ్వేల్ బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు కరుణకర్‌రెడ్డి, మధు, రైతుబంధు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ ఉన్నారు.

రేబర్తిలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ బృందం సభ్యులు ప్రవళిక పర్యటించారు. గ్రామంలో ఇంటింటా తిరిగి పారిశుద్ధ్యం, తడి, పొడి చెత్త సేకరణ, మరుగుదొడ్ల వాడకంపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం, నర్సరీ, పాఠశాల, పల్లె దవాఖానాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్ చెన్నారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీఓ ఖాజా మోహినొద్దీన్, సర్పంచ్ సవిత, కార్యదర్శి మాదవ్ జాదవ్ పాల్గొన్నారు.

గద్దర్ జ్ఞాపకార్థం కవితాగానం

హుస్నాబాద్: ప్రజా యుద్ధనౌక గద్దర్ జ్ఞాపకంగా సాహిత్య సాంస్కృతిక సారథి వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కెర సంపత్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో స్మారక కవితా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు, గాయకులు గద్దర్ జీవితంపై కవితా గానం చేశారు. సదస్సులో కవులు, కళాకారులు, వడ్డెపల్లి మల్లేశం, తిప్పర్తి శ్రీనివాసులు, గడిపె బాలయ్య, రవీందర్, తిరుపతి రెడ్డి, కనకయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తుంపర సేద్యం లాభదాయకం

చిన్నకోడూరు(సిద్దిపేట): తుంపర సేద్యంతో అధిక లాభాలు పొందవచ్చని హార్టికల్చర్ మండల అధికారి రమేష్ అన్నారు. సోమవారం చర్లఅంకిరెడ్డిపల్లిలో రైతులకు స్ప్రింక్లర్ సెట్‌లను అందించారు. ఆయన మాట్లాడుతూ తుంపర సేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయవచ్చని, రైతులు దీర్ఘ కాలిక లాభాలు వచ్చే ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వర్ణలత, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీ పరిధి ధర్మాజీపేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం రాత్రి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరగా, వారికి రేవంత్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు నర్మెట్ట ఏసురెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

సిద్దిపేటజోన్: స్వచ్ఛ సిద్దిపేట సాధనలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు అన్నారు. 4వ వార్డులో సోమవారం నడకతో చెత్త ఏరుదాం కార్యక్రమంలో భాగంగా కమిషనర్ సంపత్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డితో కలిసి చెత్త సేకరించారు. తడి, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని, కాలనీలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు రఘురాం, మోయిజ్, తిరుమల్ రెడ్డి, అరవింద్, శ్రీహరి, వినోద్, సురేష్, ఎల్లం, నాగరాజు, శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మణ్, వజీర్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

దౌల్తాబాద్(దుబ్బాక): ఈవీఎం వాడకంపై ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని తహసీల్దార్ సుజాత అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈవీఎం వాడకంపై అవగాహన కల్పించారు. ఓటు వేసే పద్ధతిని తెలుసుకోవాలని, వేసిన ఓటు రద్దుకాకుండా ఉండాలంటే తీసుకోవాల్సి జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి

గజ్వేల్: స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. సోమవారం పట్టణంలో ఇంటింటికీ జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విద్యాధర్, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, బొగ్గుల చందు, నాయకులు నర్సింగరావు, నాగు తదితరులు పాల్గొన్నారు.

పేరు నమోదు చేసుకోవాలి

సిద్దిపేటఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్-19 క్రీడా పోటీల్లో పాల్గొనే జూనియర్ కళాశాలల విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని క్రీడా పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ సమ్మయ్య తెలిపారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం లోగా జిల్లా ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులను అందించాలన్నారు.

నేడు సీనియర్ సిటిజన్లకు రాయితీ

సిద్దిపేటకమాన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే సీనియర్ సిటిజన్‌లకు ఒక్కరోజు టికెట్‌పై 50శాతం రాయితీ ఇస్తున్నట్లు డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి తెలిపారు. 60 ఏళ్లు దాటినవారు ఆధారు కార్డు చూపించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గిరిజన బంధు ఇవ్వాలి

హుస్నాబాద్‌రూరల్: ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న గిరిజన తండాల్లో యువతకు ఆర్థిక చేయూత అందించేందుకు గిరిజన బంధు ఇవ్వాలని బీజేపీ యువ మోర్చా జిల్లా కార్యదర్శి రాజన్‌నాయక్ అన్నారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతు ఎస్టీ కార్పొరేషన్ రుణాలు నిలిచిపోవడంతో యువతకు స్వయం ఉపాధి కరువైందన్నారు. ప్రభుత్వం ఆలోచించి గిరిజన బంధు అమలు చేయాలని కోరారు.

బెల్ట్‌షాపులను నిర్మూలించాలి

హుస్నాబాద్: పట్టణంలో యథేచ్ఛగా కొనసాగుతున్న బెల్ట్‌షాపులను నిర్మూలించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశాడు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో దాదాపు 50 బెల్ట్‌షాపులు ఉన్నాయని, యువత మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో లక్ష్మణ్ గౌడ్, రవీందర్, రామస్వామి తదితరులు ఉన్నారు.

వినియోగంలోకి తేవాలి

హుస్నాబాద్: పట్టణంలోని అసంపూర్తిగా మిగిలిన మినీ స్టేడియాన్ని వినియోగంలోకి తేవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం స్టేడియాన్ని పరిశీలించి మాట్లాడారు. హుస్నాబాద్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఉన్నారని, వారు ప్రాక్టీస్ చేసేందుకు మైదానం లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వినియోగంలోకి తేవాలని కోరారు. రాంప్రసాద్, అరుణ్ కుమార్, కుమారస్వామి, రాజేందర్, వెంకటేష్, శ్రీనివాస్ ఉన్నారు.